సైబర్ వలలో లద్దగిరి సర్పంచ్

కోడుమూరు (రూరల్), జూలై 18: మండలంలోని లద్దగిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ పట్టి హనుమంతు బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బు మాయం చేశారు. గురువారం హనుమంతు మాట్లాడుతూ తాను చాలా ఏళ్ల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, యూనియన్ బ్యాంకులోని తన వ్యక్తిగత ఖాతా నుంచి బుధవారం రాత్రి సెల్‌ఫోన్‌కు పదేపదే మెసేజ్‌లు వచ్చాయని అన్నారు. రూ.1.95 లక్షల నగదు మాయం అయినట్లు తెలిసిందని ఆవేదన చెందాడు. ఈ సైబర్ మోసంపై గురువారం ఉదయం పోలీసు స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు.



- సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి
- తాగునీటి పథకాల బకాయిలు ఇప్పించాలి
- అస్తవ్యస్తంగా గ్రామీణ రహదారులు
- కర్నూల్లో కృష్ణా బోర్డు ఏర్పాటుపై చర్చించాలి
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
- టీడీపీ ప్రభుత్వం కొలువుదీరాక తొలి సమావేశం
- హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

ప్రగతి పథంలో సాగేనా..?

కర్నూలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు దాటింది. తొలిసారిగా జిల్లా పరిషత్ (జడ్పీ) సర్వసభ్య సమావేశం శుక్రవారం జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి సహా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు వ్యవసాయం, గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్యం, నీటిపారుదల, విద్యుత్ శాఖల పనితీరుపై సమీక్షించనున్నారు. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో గ్రామీణ అభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. సాగునీటి ప్రాజెక్టులు పడకేశాయి. ఉన్న ప్రాజెక్టులకు నిర్వహణ నిధులు ఇవ్వలేదు. వ్యవసాయం రంగానికి జీవంపోయాలి. గ్రామీణ రోడ్లు, తాగునీటి పథకాలు ఆధునికీకరించాలి. విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలి.. ఇలా ఎన్నో సమస్యలు ఉమ్మడి జిల్లా ప్రజలను వేధిస్తున్నాయి. అదే క్రమంలో కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటుపై తీర్మానం చేయాల్సిన అవసరం ఉంది. టీడీపీ కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి జడ్పీ సమావేశంలో ప్రగతి పథంలో అడుగులు పడేలా ప్రజా ప్రతినిధులు చర్చలు.. తీర్మానాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

రైతుకు భరోసా కల్పించాలి

ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 6.38 లక్షల హెక్టార్లు. రబీలో 5.55 లక్షల హెక్టార్లు ఉంటుందని అంచనా. ప్రధాన పంటలు పత్తి, వేరుశనగ, టమోటా, ఉల్లి, మొక్కజొన్న, వరి ధాన్యం సాగు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయం రంగం నిర్వీర్యమైంది. పల్లెపల్లెన రైతు భరోసా కేంద్రాలు తెరిచారే తప్ప.. రైతు సంక్షేమం గాలికి వదిలేశారు. గతేడాది రబీ ఇన్‌పుట్ సబ్సిడీ రూ.98 కోట్లు రైతులకు అందని ద్రాక్షగా మారింది. ఖరీఫ్ పంట బీమా అందలేదు. కరువు పల్లెసీమకు కీలకమైన డ్రిప్ ఇరిగేషన్‌కు గాలికొదిలేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేపడితే.. వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతు గ్రూపులు ఏర్పాటు చేసి వైసీపీ నాయకులకు రూ.15-25 లక్షల వరకు ట్రాక్టర్లు వంటి వ్యవసాయ యంత్రాలు ఇచ్చారు. సామాన్య రైతులకు తీరని అన్యాయం చేశారు. నకిలీ, నాసికరం విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. రైతులకు డ్రిప్, వ్యవసాయ యంత్రీకరణ, నాణ్యమైన విత్తనాలు, అన్నదాత పథకం ద్వారా రైతుకు రూ.20 వేలు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో అదేలా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.









వ్యవసాయ కనెక్షన్లకు నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు నెలలుగా నిరీక్షిస్తున్నారు. రెండు జిల్లాల్లో 15.29 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో వ్యవసాయ కనెక్షన్లు 2.13 లక్షలు ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ కోసం గత ఆగస్టు నుంచి దాదాపు 9 వేల మంది రైతులు దరఖాస్తులు చేసి నిరీక్షిస్తున్నారు. రైతులు ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారు. వీటికి 2 వేలు ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు కోసం రైతుల నుంచి బ్యాంక్ ఖాతా, డెబిట్ మ్యాన్‌డెట్ ఫారాలు తీసుకున్నారు. రైతులు మీటర్లు వద్దు అంటున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆత్మకూరులో విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. గత ప్రభుత్వంలో సబ్ స్టేషన్ల నిర్వహణ పేరిట వైసీపీ నాయకుల సిఫారసు మేరకు ఇష్టారాజ్యంగా సిబ్బందిని తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



అసంపూర్తిగా ఆర్‌డీఎస్ కాలువ హెడ్ వర్క్ స్లూయిస్

తాగునీటి బకాయిలు ఇప్పించాలి

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గ్రామీణ తాగునీరు సరఫరా, పారిశుధ్యం శాఖ పర్యవేక్షణలో 60 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకాలు ఉన్నాయి. వాటి ద్వారా సుమారుగా 950 గ్రామాలకు శుద్ధి చేసిన (ఫిల్టర్) తాగునీరు అందిస్తున్నారు. వీటి నిర్వహణ కోసం ప్రభుత్వం ఓ అండ్ ఎం గ్రాంట్ కింద ఏటేటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ కోసం రూ.85.71 కోట్లు జిల్లా పరిషత్ (జడ్పీ) అధికారులు పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఆ నిధులతో విద్యుత్ బిల్లులు కోసం రూ.40.88 కోట్లు, స్కీంల నిర్వహణ, తాత్కాలిక మరమ్మతులు, సిబ్బంది జీతాలు కోసం రూ.44.83 కోట్లు కేటాయించారు. పలు స్కీంలకు 15 నెలలు, కొన్ని స్కీంలకు 24 నెలలు నుంచి ఓ అండ్ ఎం నిధులు అందడం లేదు. ఆదోని, ఆస్పరి, ఆలూరు మండలాల్లో పలు గ్రామాలకు తాగునీరు అందించే ఆస్పరి సీపీడబ్ల్యూఎస్ స్కీం కాంట్రాక్టరుకు మూడేళ్లుగా ఓ అండ్ ఎం నిధులు ఇవ్వలేదు. నిధులు ఇవ్వకపోవడం వల్ల సిబ్బందికి జీతాలు అందడం లేదు. నిధులు లేక ఆయా స్కీంలు బంద్ అయితే తాగునీటి కోసం పల్లెజనం తల్లడిల్లాల్సి వస్తుంది.

● కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర విభజన తరువాత కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్‌లో, గోదావరి నదీయాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తెలంగాణలో ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉంది. కృష్ణా నది, ఆ నదిపై నిర్మించిన ప్రాజెక్టులు రెండు రాష్ట్రాల ప్రాజెక్టులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో దగ్గరలోనే ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కృష్ణా డెల్టాకు ఇవ్వాల్సిన కృష్ణా జలాలు కూడా శ్రీశైలంలో నిల్వ చేసిన సీమ ప్రాజెక్టులకు మళ్లించే అవకాశం ఉంది. పాలన పరమైన నిర్ణయాలు, నీటి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని పదేళ్లుగా రైతులు కోరుతున్నారు. గత వైసీపీ సర్కారు కృష్ణా నది, ప్రాజెక్టులకు ఏ మాత్రం సంబంధం లేని విశాఖలో ఏర్పాటు చేసింది. ఈ బోర్డు కర్నూలులో ఏర్పాటు చేసేలా జడ్పీలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలి. చంద్రబాబును ఒప్పించాల్సిన బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలుపై ఎంతో ఉంది.

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

రాష్ట్ర విభజన అనంతరం ఏర్పాటైన చంద్రబాబు ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. రాయలసీమ జల జీవనాడి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, కడప జిల్లాకు కృష్ణా జలాలు పంపించే అవుకు బైపాస్ టన్నెల్ టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. పశ్చిమ ప్రాంతం కరువు, వలసలు నివారించే లక్ష్యంగా 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ రైట్ బ్యాంక్ కెనాల్‌కు శ్రీకారం చుట్టింది. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని రూ.1,942.38 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరిలో జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేసింది. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవార్గల్లో 40 వేల ఎకరాలకు సాగు, పలు గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ అదే ఏడాది జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76 జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ప్రాజెక్టులు అటకెక్కాయి. సీమకు జీవనాడి తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మాణం కోసం 2019 ఫిబ్రవరి 21న అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం రూ.2,890 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీఓ నం.154 జారీ చేశారు. వైసీపీ వచ్చాక అంతరాష్ట్ర సమస్య అంటూ ఆ ఫైల్‌ను పట్టించుకోలేదు. కేవలం రూ.150 కోట్లు ఇస్తే హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద 65 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా ఒక్కపైసా ఇవ్వలేదు. శ్రీశైలం ప్రాజెక్టు, వెలుగోడు జలాశయం మరమ్మతులకు డ్రిప్-2 కింద కేంద్రానికి ప్రతిపాదనలు పంపినా గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో నిధులు కాలేదు. రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరిట రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు చేపట్టి తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్దిపొందాలని చూశారే తప్పా ఆ ప్రాజెక్టు ఎక్కడికక్కడే ఆగిపోయింది. తెలుగుగంగ, ఎస్సార్బీసీ కాలువ ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.



ఆస్పరి రక్షిత మంచినీటి పథకం ఎస్ఎస్ ట్యాంక్

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

కలెక్టర్ రంజిత్ బాషా




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నకలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూలై 18: జిల్లాలో డయేరియా, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో అరికట్టాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం సీజనల్ వ్యాధులు అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఈవోఆర్డీలు, మెడికల్ ఆఫీసర్లతో కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్యం, నీటి కలుషితం వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందకూడదని, ఒక్క మరణం కూడా సంభవించకూడదని హెచ్చరించారు. డయేరియా సమస్య రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, తహసీల్దార్లు షెడ్యూల్ రూపొందించుకుని ప్రతి వారంలో నాలుగు గ్రామాలను సందర్శించాలన్నారు. ఈ నెల 31వ తేదీలోపు గ్రామాల సందర్శన పూర్తి చేసి తనిఖీ నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించారు.

తుంగభద్రకు లక్ష క్యూసెక్కుల వరద

- 46.8 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- శ్రీశైలం నుంచి సాగర్‌కు 20,506 క్యూసెక్కులు

కర్నూలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. కరువు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తుంగభద్ర గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. గురువారం నీటి లెక్కలు కొలిచే సమయానికి 1614.31 అడుగుల వద్ద 46.80 టీఎంసీలు వరద చేరింది. డ్యాం ఎగువన కురుస్తున్న వర్షాలకు ఉదయం 82,491 క్యూసెక్కుల వరద నమోదైంది. సాయంత్రం 6 గంటలకు వరద లక్ష క్యూసెక్కులు దాటిందని టీబీపీ బోర్డు అధికారులు తెలిపారు. వరద ఆశాజనకంగా ఉండటంతో కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని ఎల్లెల్సీ, హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు ఉత్సాహంగా ఉన్నారు. ఎల్లెల్సీ కింద ఖరీఫ్, రబీ కలిపి 1.51 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంటే.. ఖరీఫ్‌లో 45,450 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. బుధవారం తాగునీటి కోసం 300 క్యూసెక్కులు ఎల్లెల్సీకి విడుదల చేశారు. డ్యాంకు లక్ష క్యూసెక్కుల వరద నమోదు కావడంతో తక్షణమే ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద అడుగులు ఇప్పుడిప్పుడే పడుతున్నాయి. గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 806.80 అడుగుల వద్ద 32.46 టీఎంసీలు నిల్వ ఉంది. ఎగువ నుంచి జలాశయంలోకి 14,700 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. తెలంగాణ, కృష్ణా డెల్టా ప్రాంతాల తాగునీటి అసరాల కోసం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇచ్చిన ఇండెంట్ మేరకు శ్రీశైలం నుంచి 9 టీఎంసీలు తీసుకోవడానికి కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చింది. దీంతో ఏపీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ద్వారా 7,888 క్యూసెక్కులు, ఏపీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ద్వారా 12,618 క్యూసెక్కులు కలిపి 20,506 క్యూసెక్కులు దిగువన నాగార్జున సాగర్‌కు విడుదలు చేస్తున్నారు. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 20,079 క్యూసెక్కులు దిగువన శ్రీశైలానికి వదులుతున్నారు. అయితే.. శ్రీశైలానికి చేరుతున్న వరద 14,700 క్యూసెక్కులు కాగా.. విద్యుత్తు ఉత్పత్తి ద్వారా సాగర్‌కు వదులుతున్న నీరు 20,506 క్యూసెక్కులు. అయితే పై నుంచి వస్తున్న వరద కంటే దిగువకు ఎక్కువగా వదిలేసి జలాశయాన్ని ఖాళీ చేస్తుండడంతో సీమ రైతులు ఆందోళన చెందుతున్నారు.



తుంగభద్ర జలాశయానికి చేరిన వరద

నేడు డీఐజీగా కోయ ప్రవీణ్

బాధ్యతల స్వీకరణ



కోయ ప్రవీణ్

కర్నూలు, జూలై 18: కర్నూలు రేంజ్ డీఐజీగా డాక్టర్ కోయ ప్రవీణ్ శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నారు. విశాఖపట్నం గ్రేహౌండ్స్ డీఐజీగా పని చేస్తున్న ఈయన ఇటీవల జరిగిన బదిలీల్లో కర్నూలు రేంజ్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆయన కర్నూలుకు చేరుకున్నారు. స్థానిక పోలీసు అతిథిగృహం చేరుకున్న ఆయనకు ప్రస్తుత డీఐజీతో పాటు కర్నూలు, నంద్యాల ఎస్పీలు, డీఎస్పీలు స్వాగతం పలికారు. ప్రస్తుత డీఐజీ విజయరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. బదిలీపై వెళ్తున్న విజయరావుకు గురువారం రాత్రి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల ఎస్పీలతో పాటు పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఈ సభలో పాల్గొన్నారు.

ఎస్జీటీ అభ్యర్థులకు వరం



- బీసీ స్టడీ సర్కిల్‌లో 200 మందికి ఉచితంగా డీఎస్సీ కోచింగ్
- శిక్షణతో పాటు స్టైఫండ్, మెటీరియల్ ఉచితం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 18: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌జీటీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. దీంతో బడుగు, బలహీన వర్గాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ వరంగా మారింది. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులను నోటిఫికేషన్‌లో ప్రకటించారు. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే బడుగు, బలహీన వర్గాల నిరుద్యోగులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్‌ను అందిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ సెంటరులో 200 మందికి ఉచితంగా డీఎస్సీకి కోచింగ్ ఇవ్వనున్నారు. ఇందులో బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం ప్రకారం సీట్లను కేటాయించి కోచింగ్ ఇవ్వనున్నారు. రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలగకుండా ఇప్పుడు కేటాయించిన సీట్లకు అదనంగా పది శాతం పెంచి ఈడబ్ల్యూఎస్ కోటా కింద వర్తింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. డీఎస్సీ (ఎస్‌జీటీ) పోస్టులకు మాత్రమే బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్‌ను అందించనున్నారు. టీడీపీ పాలనలో బీసీ స్టడీ సర్కిల్‌లో వీఆర్వో, వీఆర్‌ఏ, పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు, డీఎస్సీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వడం ద్వారా పేద, మధ్య తరగతి నిరుద్యోగులకు కొంత ఊరట కలిగేది. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీ స్టడీ సర్కిల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ సౌకర్యం పొందే అవకాశం లేకపోవడంతో ముఖ్యంగా గ్రామీణ పేద కుటుంబాల నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు కోచింగ్‌లకు వెళ్లి వేలకు వేలకు ఫీజులుచెల్లించే స్థోమత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల నోటిఫికేషన్‌కు యువత ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోనూ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇప్పించడంలో సీఎం చంద్రబాబుకు ఎవరూ సరిలేరని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణతో పాటు స్టైఫండ్, మెటీరియల్ పంపిణీ

బీసీ స్టడీ సర్కిల్ కేంద్రంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ పొందే అభ్యర్థులకు ప్రభుత్వం ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌తో పాటు రెండు నెలల శిక్షణా కాలంలో స్టైఫండ్‌ను అందిస్తోంది. నెలకు ఒక్కో అభ్యర్థికి రూ.1,500 చొప్పున రెండు నెలలకు రూ.3 వేలు ప్రభుత్వం అందిస్తుంది. వెయ్యి రూపాయలు విలువ చేసే మెటీరియల్ కూడా అందిస్తారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు కల్లూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఇవ్వనున్నారు.

ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో ఫీజుల దోపిడీ

ప్రైవేటు కోచింగ్ కేంద్రాల్లో డీఎస్సీ, టెట్ పరీక్షలకు కోచింగ్‌లో శిక్షణ పొందాలంటే ఒక్కొక్క నిరుద్యోగ అభ్యర్థి నుంచి రూ.18 నుంచి 20వేల వరకు కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు ఫీజులను వసూలు చేస్తున్నారు. బడుగు బలహీన వర్గాల కుటుంబాల నిరుద్యోగులు ఫీజులు చెల్లించే స్థోమత లేక ఇంటి దగ్గరే ఉండి.. టెట్, డీఎస్సీ పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ అవుతున్నారు. చాలా మంది నిరుద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలను వదులుకుని ఇంటి దగ్గరే ఉండి పూర్తి సమయాన్ని కేటాయిస్తున్నారు. ఉద్యోగంతో పాటు అరకొర జీతాన్ని వదులుకుని ఫీజు చెల్లించి కోచింగ్ తీసుకోలేని నిరుద్యోగులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ శిక్షణా తరగతులు కొండంత బలాన్ని ఇస్తుంది. బీసీ స్టడీ సర్కిల్ కేంద్రాల్లో ఉచిత కోచింగ్ టానిక్‌లా పని చేస్తుందని నిరుద్యోగులు అంటున్నారు. ఇది సువర్ణ అవకాశం అని నిరుద్యోగ యువత ఆనందాన్ని వెల్లువిరుస్తోంది.



టీటీసీ ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో వచ్చిన మార్కుల మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. శిక్షణా కాలం 60 రోజులు ఉంటుంది. ఒక్కో అభ్యర్థికి ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌తో పాటు నెలకు రూ.1,500 చొప్పున రెండు నెలల పాటు రూ.3 వేలు స్టైఫండ్ ఇస్తారు. - వెంకటలక్ష్మమ్మ, డీబీసీడబ్ల్యూవో, బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి, కర్నూలు

మంత్రి బీసీని కలిసిన ఎస్పీ



మంత్రి బీసీకి మొక్క అందజేస్తున్న ఎస్పీ

బనగానపల్లె, జూలై 18: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అధిరాజ్‌సింగ్ రాణా రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని గురువారం టీడీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బీసీ జనార్దన్‌రెడ్డికి ఎస్పీ పూలమొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతల విషయమై ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, ఆయన సోదరులు బీసీ రామనాథరెడ్డి, తనయుడు బీసీ మౌర్యనాథరెడ్డి ఉన్నారు.



నంద్యాల క్రైం, జూలై 18: జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను గురువారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆళ్లగడ్డలో శాంతిభద్రతల పర్యవేక్షణపై చర్చించారు.

నల్లమల్లలో ఇద్దరు వేటగాళ్ల అరెస్టు


- నాటు తుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు



పట్టుబడిన వేటగాళ్ళతో ఫారెస్టు అధికారులు

రుద్రవరం, జూలై 18: నల్లమలలో వన్య ప్రాణి వేటగాళ్ళు సంచరిస్తున్నట్లు సమచారం అందడంతో డిప్యూటీ రేంజర్ మూర్తుజావలి దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు రేంజర్ శ్రీపతి నాయుడు గురువారం తెలిపారు. సవరం పిచ్చయ్య, సవరం వీరయ్య అనే ఇద్దరి నుంచి ఒక నాటు తుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరు నల్లమల్ల అడవిలోని పావన నరసింహ స్వామి దేవాలయం సమీపంలో వన్యప్రాణులను వేటాడేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని కోవెలకుంట్ల కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఆగస్టు 1వ తేది వరకు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ దాడిలో మెబైల్ పార్టీ డిప్యూటీ రేంజర్ నాగేంద్ర నాయక్, బీట్ ఆఫీసర్లు విజయవర్ధన్, నాగ ఉసేనయ్య పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి 25,174 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యామ్

శ్రీశైలం, జూలై 18: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి గురువారం ఇన్‌ఫ్లో నమోదైంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 25,174 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 806.60 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 32.3781 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 7,064 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వర్సిటీలకు ఇన్‌చార్జి ఉపకులపతుల నియామకం



ఉపకులపతిగా బాధ్యతలు తీసుకున్న ఎన్‌టీకే నాయక్

కర్నూలు(అర్బన్), జూలై 18: జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు ఇన్‌చార్జి ఉపకులపతులను నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు రాయలసీమ యూనివర్సిటీకి అక్కడ రెక్టార్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను, యోగివేమన యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ పఠాన్ షేక్ షావలీ ఖాన్‌ను డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి ఇన్‌చార్జి ఉపకులపతులుగా నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ జీవో జారీ చేశారు. గతంలో రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా పనిచేసిన సుధీర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఫజలూర్ రహమాన్ రాజీనామా చేయడంతో వారి స్థానంలో వీరిని నియమించారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతిగా ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ బాధ్యతలు తీసుకున్నారు. రిజిస్ట్రార్ ఎన్ వెంకటేశ్వర్లు, డీన్‌లు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, వర్సిటీలోని వివిధ విభాగాల అధ్యాపకులు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

20న నిరుద్యోగులకు జాబ్ మేళా

కర్నూలు(అర్బన్), జూలై 18: సీ. క్యాంప్ జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిరుద్యోగులకు ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి పీ. దీప్తి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు నవతారోడ్డు ట్రాన్స్‌పోర్టు, సంగీత మొబైల్స్, ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ కంపెల ప్రతినిధులు హాజరవుతారని, పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్ లాంటి విద్యార్హతలను బట్టి ఎంపికైన వారికి నెలకు రూ. 10,820 నుంచి 16,000 వరకు జీతం ఇస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు.

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు

కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



నిత్యావసర వస్తువుల పంపిణీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, జూలై 18 : బనగానపల్లె పట్టణంలో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు సరఫరా కేంద్రం ప్రత్యేక కౌంటర్‌ను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. బనగానపల్లె పట్టణంలోని శాఖా గ్రంథాలయం పక్కన ఉన్న గ్రామ పంచాయతీ రూమ్ నంబరు 1లో హోల్ సేల్ వ్యాపారులు, రైస్ మిల్లుల వ్యాపారుల సహకారంతో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 9 నియోజకవర్గ కేంద్రాల్లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. బనగానపల్లె పట్టణంలో తొలి కౌంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. రైతు బజార్లకు సమాంతరంగా వీటిని తీర్చిదిద్దుతామన్నారు. సరసమైన ధరలకు పేద, మధ్య తరగతి ప్రజలకు బియ్యం, కందిపప్పు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, తహసీల్దారు రవీంద్రారెడ్డి, పౌర సరఫరా శాఖ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు బురానుద్దీన్, టంగుటూరు శ్రీనయ్య, టీఎన్‌ఆర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయాధికారికి పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు(లీగల్), జూలై 18: కర్నూలు జిల్లా నూతన ఎస్పీ జి. బిందు మాధవ్ గురువారం జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం అందించేలా తమ శాఖ కృషి చేస్తుందని తెలిపారు.

బెంగళూరుకు అత్యాధునిక స్టార్ లైనర్ బస్సు

కర్నూలు(రూరల్), జూలై 18: కర్నూలు నుంచి బెంగళూరుకు అత్యాధునిక స్టార్ లైనర్ బస్సు(నాన్ ఏసీ, స్లీపర్)ను నడుపుతున్నట్లు కర్నూలు-1డిపో మేనేజర్ కె. సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సును గురువారం నుంచే ప్రారంభించామని ఆమె తెలిపారు. కర్నూలులో రాత్రి 10గంటలకు బయలుదేరి బెంగళూరుకు ఉదయం 05.15గంటలకు చేరుకుంటుందన్నారు. అదేవిధంగా బెంగళూరులో రాత్రి 10గంటలకు బయలుదేరి కర్నూలుకు ఉదయం 05.15గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఒక కింది బెర్తు రూ.920, పై బెర్తు రూ.850 చార్జీ ఉంటుందని తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలలకు సీట్ల కేటాయింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 18: ఇంజనీ రింగ్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన ఆన్‌లైన్ ప్రక్రియ మొదటి విడత సీట్ల కేటాయింపు జరిగింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు జూలై 1వ తేదీన ప్రారంభమైంది. అయితే మధ్యలో కొంత ఆటంకం జరిగినప్పటికీ షెడ్యూల్ ప్రకారమే విద్యార్థులకు కళాశాలలో సీట్ల కేటాయింపు జరి గింది. కళాశాలలకు సీట్లు కేటాయిం చిన విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు రిపోర్టు చేసుకోవాల్సి ఉంది. ఆయా కళాశాలల్లో రిపోర్టు చేసుకోకపోతే విద్యార్థులు సీట్లను కోల్పో తారు. షెడ్యూల్ ప్రకారం రెండో విడత ప్రవేశాల ప్రక్రియ కొనసా గుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాయలసీమ యూనివర్సిటీతో పాటు మొత్తం 12 ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద అన్ని బ్రాంచుల్లో మొత్తం 7,164 సీట్లు ఉన్నాయి. ఇందులో 6,159 సీట్లు మాత్రమే భర్తీ కాగా, ఇంకా 1005 సీట్లు భర్తీ కాలేదు. నాలుగు కళాశాలల్లో 98 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా ఒక కళాశాలలో 93 శాతం సీట్లు భర్తీ కాగా, మిగతా కళాశాలల్లో అంతంత మాత్రంగానే సీట్లు భర్తీ అయ్యాయి. రాయలసీమ యూనివర్సిటీలో ప్రవేశాలు అంతంతే.. కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో అంతంత మాత్రంగానే ప్రవేశాలు ఉండగా.. కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లోనూ కన్వీనర్ కోటా కింద సీట్లు భర్తీ కాలేదు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉచితంగా సీట్లు పొందే అవకాశం ఉన్నా యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత, ప్లేస్ మెంటు వంటి అవకాశాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అయిష్టత చూపారనేది స్పష్టంగా తెలుస్తుంది. ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ సీట్ల కోటాకే దిక్కులేదు.. ఇక మేనేజ్‌మెంట్ కోటాలో చేరే వారి సంఖ్య ఎంత ఉండేది అర్థం చేసుకోవచ్చు. తక్కువ విద్యార్థులతో కళాశాలలను నడుపుకోలేక ప్రైవేటు కళాశాలలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

కళాశాలలో భర్తీ అయిన సీట్ల వివరాలు: కర్నూలు అశోక ఇంజనీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటా కింద మొత్తం 720 సీట్లకు గాను 677 భర్తీ అయ్యాయి. ఇంకా 43 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఏఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 528కి గాను 427 సీట్లు భర్తీ కాగా.. 101 మిగిలాయి. అలాగే ఆదోని భీమా ఇంజనీరింగ్ కళాశాలలో 288 సీట్లకు గాను కేవలం 78 సీట్లు భర్తీ అయ్యాయి. కర్నూలు బృందావన్ ఇంజనీరింగ్ కళా శాలలో 336 సీట్లకు గాను 103 సీట్లు భర్తీ అయ్యాయి. జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 912 సీట్లకు గాను 898 భర్తీ అయ్యాయి. ఎమ్మిగనూరు సెయింట్ జోన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 528 సీట్లకు గాను 378 భర్తీ కాగా, 150 సీట్లు భర్తీ కాలేదు. కర్నూలు కేవీఎస్‌ఆర్ కళా శాలలో 624 సీట్లకు గాను 579 భర్తీ కాగా, ఇంకా 45 మిగిలి ఉన్నాయి. కర్నూలు జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 672 సీటకు గాను 656 భర్తీ అయ్యాయి. రవీంద్ర మహిళా కళాశాలలో 336 సీట్లకు గాను 331 సీట్లు భర్తీ అయ్యాయి. నంద్యాల ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో 1296 సీట్లు ఉండగా.. 1229 భర్తీ అయ్యాయి. కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో 396 సీట్లుకు గాను 283 భర్తీ అయ్యాయి. 113 ఖాళీ ఉన్నాయి. నంద్యాల శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో 528 సీట్లకు గాను 520 సీట్లు భర్తీ కాగా, 8 ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది జరిగిన ఇంజనీరింగ్ కళాశాలల ప్రవేశాల్లో ఉమ్మడి జిల్లాలో ఒక కళాశాలలో కూడా వంద శాతం ప్రవేశాలు జరగలేదు.

కార్యకర్తల ప్రయోజనాలకు పెద్దపీట



సభ్యత్వ నమోదు యాప్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ ప్రతినిధులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 18: ఇటీవలి ఎన్నికల్లో ప్రజాతీర్పు తమకు రెట్టింపు ఉత్సాహాన్నిచ్చిందని, ఆ స్ఫూర్తితో క్రియాశీల సభ్యత్వ నమోదును మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త చింతా సురేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈసారి సభ్యత్వ నమోదు, గతానికి భిన్నంగా నిర్వహిస్తున్నమని అన్నారు. క్రియాశీల సభ్యులు ప్రమాదవ శాత్తు గాయపడినా, మృతి చెందినా.. వారి కుటుంబానికి ఆర్థికంగా ఆసరా అందిస్తామని అన్నారు. ఈ నెల 22 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన ప్రతినిధులు మంజునాథ్, బజారి, సుమలత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- జనసేన పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ ఆధ్వర్యంలో స్థానిక దర్గాచౌక్ వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా సభ్యత్వ నమోదుకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు.
- స్థానిక వెంకటరమణ కాలనీలో పార్టీ రాయలసీమ జోనల్ ఎన్నికల కన్వీనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

వైసీపీ నాయకుల రౌడీయిజం

- పోలీస్‌స్టేషన్ ముందే టీడీపీ కార్యకర్తపై రాళ్లతో దాడి
- ఇరువురిపై కేసు నమోదు



పోలీస్‌స్టేషన్‌ముందు టీడీపీ కార్యకర్తపై రాళ్లతో దాడి చేస్తున్న వైసీపీ నాయకులు



చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త

ఆదోని రూరల్, జూలై 18 : ఏ ప్రభుత్వం ఉన్నా తమ తీరు ఇంతే అన్నట్లు వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ వద్దే టీడీపీ కార్యకర్తపై రాళ్లతో మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన ఆదోని తాలుక పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం జరిగింది. ఆదోని మండలం నలకలకొండ గ్రామంలో గురువారం టీడీపీ కార్యకర్తలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నాయకులు విజయ్, రాముడు, మల్లేష్, మల్లికార్జునల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకొంది. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కొళ్లమని చెప్పారు. తాలుక పోలీస్‌స్టేషన్ వద్దకు ఇరుపార్టీలకు చెందిన వారు వెళ్లారు. అక్కడ వైసీపీకి చెందిన విజయ్, రాముడు, మల్లేష్, మల్లికార్జున పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న రాళ్లు తీసుకొని టీడీపీ కార్యకర్త శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలపై దాడి చేసి పిడిగుద్దులు గుద్దారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో అక్కడే ఉన్న కానిస్టేబుల్ వచ్చి విడిపించే ప్రయత్నం చేశారు. అయినా వైసీపీ నాయకులు వెనక్కి తగ్గకుండా రౌడీయిజాన్ని ప్రదర్శించారు. తీవ్రంగా గాయపడ్డ టీడీపీ కార్యకర్తను ఆసుపత్రికి తరలించారు. తమను కులం పేరుతో దూషించడంతోపాటు తమపై టీడీపీ వారు దాడి చేశారని వైసీపీ నాయకులు, తమను పోలీస్ స్టేషన్ వద్దే రాళ్లతో వైసీపీ నాయకులు దాడి చేశారని టీడీపీ కార్యకర్తలు తాలుక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నీరంజన్ రెడ్డి తెలిపారు.

శ్రీశైలం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలం, జూలై 18: శ్రీశైలం దేవస్థానంలో గురువారం 53 మంది శాశ్వత, ఒప్పంద, పొరుగుసేవల సిబ్బందిని బదిలీ చేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ బదిలీలు దేవస్థానంలో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా చేపట్టినట్లు పేర్కొన్నారు. బదిలీల్లో పర్యవేక్షకురాలు కె.గిరిజామణికి ఆలయ విభాగ ఫైళ్లపరిశీలన, కె.శివప్రసాద్‌కు లడ్డూతయారీ విభాగాలను కేటాయించారు. స్థానచలనం పొందిన సిబ్బంది వెంటనే ఉత్తర్వుల ప్రకారం సదరు అధికారులకు కేటాయించిన విధులలో వెంటనే రిపోర్టు చేయాలని ఈవో పెద్దిరాజు ఆదేశించారు.

బనవాసిలో నవోదయ ప్రవేశాలకు దరఖాస్తులు

ఎమ్మిగనూరు, జూలై 18: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి ప్రవేశానికి (2025-26) నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3,4వ తరగతిలో ఉత్తీర్ణత పొంది ఐదో తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులు (కర్నూలు, నంద్యాల జిల్లాలు) మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 01.05.2013నుంచి 31.07.2015 మధ్య జన్మించిన వారే అర్హులన్నారు. సెప్టెంబరు 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వచ్చే ఏడాది జనవరి 25వ తేదీన ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలు నవోదయ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు.

పాముకాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 18: మండలంలోని కడివెళ్ల గ్రామంలో మధుప్రియ(4) అనే చిన్నారి పాముకాటుకు గురై మృతి చెందింది. సంతనాగలాపురం గ్రామానికి చెందిన వీరేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం కడివెళ్ల గ్రామానికి వెళ్లాడు. మొహర్రం వేడుకలను చూసి రాత్రి అదే గ్రామంలోని తమ బంధువుల కొట్టంలో నిద్రించారు. రాత్రి వీరేష్‌తో పాటు తన నాలుగేళ్ల మధుప్రియను పాము కాటు వేసింది. వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే విష మించడంతో చిన్నారి మధుప్రియ మృతి చెందగా వీరేష్ కోలుకున్నాడు.

హెల్మెట్ వాడకంపై ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఫ్యామిలి కోర్టు న్యాయాధికారి జి.ప్రతిభాదేవి

కర్నూలు(లీగల్), జూలై 18: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీని ఫ్యామిలి కోర్టు న్యాయాధికారి జి. ప్రతిభాదేవి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక జిల్లా కోర్టు నుంచి కొండారెడ్డి బురుజు వరకు జరిగిన ఈర్యాలీలో న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను ఉపయోగించి ప్రమాదాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 18: అథ్లెటిక్స్ చిన్నారులకు సీఐడీ సీఐ నగేష్, అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి, డీఎస్‌డీవో భూపతిరావులు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో గురువారం అథ్లెటిక్ సమ్మర్ క్యాంప్ క్లోజింగ్ సెర్మనీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై చిన్నారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కిట్ సమ్మర్ క్యాంపు కోచ్ ఇస్మాయిల్ బాషా, స్పాన్సర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సి.బెళగల్, జూలై 18: మండలంలోని కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాధికారి ఆదాం బాషా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయుడికి ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్ కేంద్రాలను కూడా తనిఖీ చేశారు. ఆయన వెంట సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నగరాభివృద్ధే లక్ష్యం

» అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన

కర్నూలు(అర్బన్), జూలై 18: నగరాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరిగా తమ తెలుగు దేశం ప్రభుత్వ పాలనలో కమిషన్లు తీసుకునే వారెవ్వరూ తమ వద్ద లేరని, కాంట్రాక్టర్లు తీసుకున్న పనులు సక్రమంగా పూర్తి చేసి ప్రజలకు ఇవ్వాల న్నారు. నగరంలోని వార్డుల్లో తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలన్నీ తెలు సుకున్నామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల శుభకార్యాలు, ఇతర కార్యక్ర మాలు చేసుకునేందుకు కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తే ..గత ప్రభుత్వం వాటిని సచివాలయాలుగా మార్చేసిందని, అందుకే ప్రజల కోసం మళ్లీ కమ్యూనిటీ హాల్స్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ డ్రైనేజీ కాలువలు, రూ. 39లక్షలతో సీసీ రోడ్లు, 17వ వార్డులో చణక్యపురి కాలనీలో రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాల్, 15వ వార్డు బుధవారపేటలో శ్మశానవాటికలో రూ. 70 లక్షలతో మౌలిక సదుపా యాల కల్పనకు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి మంత్రి శంకుస్థాప నలు చేశారు. దాదాపుగా రూ. 2 కోట్ల నిధులకు సంబంధించి మంత్రి తొలిసారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు పరమేష్, కైప పద్మాలతారెడ్డి, పల్లవి, శివమ్మ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంఈలు షాకీర, శేషసాయి, ఏఈలు జనార్దన్, భాను, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు

బాలికల వసతి గృహం తనిఖీ

గూడూరు జూలై 18: గూడూరులోని బాలికల వసతి గృహాన్ని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని పరిసరాల్లో నీరు నిలిచి ఉండటంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసారు. వసతి గృహంలో వంట గది, విద్యార్థినుల గదులు, లెట్రిన్, బాత్ రూంలను పరిశీలించారు. హాస్టల్‌లో వసతులను మెరగు పరచాలని వార్డెన్‌కు సూచించారు. వసతి గృహంలో ఎంత మంది విద్యార్థినీలున్నారు, వారికి ప్రతి రోజు అందిస్తున్న మెనూపై ఎమ్మెల్యే ఆరా తీసారు. గత ప్రభుత్వ హయాంలో వసతి గృహం కొత్తగా నిర్మించేందుకు రూ. 3కోట్లు అంచనాతో ప్రతిపాదనలు అధికారులు పంపారని వార్డెన్ ఎమ్మెల్యేకు వివరించారు. వసతి గృహం అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట హాస్టల్ వార్డన్ మాదవేనమ్మ, సిబ్బంది ఉన్నారు.

● గృహ నిర్మాణాలపై ఎమ్మెల్యే ఆరా: గృహ నిర్మాణాలపై కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆరా తీసారు. గురువారం గూడూరులో పర్యటించిన ఆయన హౌసింగ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.



కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే



గూడూరులో బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల తనిఖీ

కర్నూలు(రూరల్): కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అక్కడి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో మధ్యాహ్న భోజనాన్ని పరిసరాలను పరిశీలించి తరగతి గదుల్లోకి వెళ్ళి విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల గురించి చర్చించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం సక్రమంగా పెడుతు న్నారా..వాటితో పాటు ఇక్కడి సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయని ఎమ్మెల్యే దస్తగిరి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చోని ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట గూడూరు పట్టణ టీడీపీ యువనాయకులు బోయ వెంకటేశ్వర్లు, పసుపుల శంకరయ్య ఉన్నారు.

బాలాజీ క్యాంటీన్‌పై సూపరింటెండెంట్ ఆగ్రహం

కర్నూలు(హాస్పిటల్), జూలై 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశా లలో ఉన్న బాలాజీ క్యాంటీన్ యజమాన్యం ఆసుపత్రి ఆవరణలో వ్యర్థాలను వేయడంపై సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన పలు విభాగాల్లో రౌండ్స్ నిర్వహించారు. పరిసరా ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. టీజీ మినరల్ వాటర్ ప్లాంట్ల పనితీరును పరిశీలించి, మాతా శిశు సంరక్షణ కేంద్రం వద్ద నీరు పోయేలా చూడాలని ఏపీఎం ఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌ను ఆదేశించారు. పురుషులు, స్త్రీల మెడికల్ వార్డు ల్లో గ్రిల్, టైల్స్ వేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఐడీ వార్డు దగ్గర ఉన్న డంప్ యార్డును ఇక నుంచి నూతన డంప్ యార్డులో చెత్తను వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూ టీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మిని స్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్, ఏవో శ్రీనివాసులు, నర్సింగ్ సూపరిం టెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో యుద్ధ ప్రాతిపదికన మార్పులు: కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాలలో యుద్ధప్రాతిపదికన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు ఆసు పత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం ధన్వంతరీ హాలులో ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. నెలలో 17 సంస్కరణలు అమలు చేశానని అన్నారు. పాత బ్లడ్ బ్యాంకును ఆధునీకరించి ఏఎంసీని అదనపు 12 బెడ్లతో 12 వెంటిలేటర్లు, 12 మానిటర్లతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే క్యాజువాల్టీలో కూడా 20 పడకలతో మరో క్యాజువాల్టీ పనులు జరుగు తున్నాయన్నారు. ఏఎంసీ, క్యాజువాల్టీ అభివృద్ధికి తక్కువ ఖర్చుతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ విభాగాలకు ప్రతి రోజు ఓపీ సేవ లు, డైట్ పర్యవేక్షణతో నాణ్యతను పెంచడం, ఏఎంసీలో అల్ట్రాసౌండ్ మిషన్ సర్జరీ ఓటీ దగ్గర ర్యాంప్‌ను ఏర్పాటు చేసే పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏవో శ్రీనివాసులు, ఆఫీస్ సూపరింటెండెంట్ కుమారస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరితకు అభినందన

కల్లూరు, జూలై 18: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను రాయలసీమ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ఎన్ టీకే నాయక్ సన్మానించారు. గురు వారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు చరితను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.



గౌరు చరితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్‌యూ వీసీ

ఉచిత ఈ ఫైలింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 18: కర్నూలు జిల్లాలో పని చే స్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ఈ నెల 31వ తేదీలోపు ఇన్‌కమ్ ట్యాక్స్ ఈ ఫైలింగ్ ప్రక్రియ చేసుకునే అవకాశం ఉందని జిల్లా అధ్యక్షుడు బి.చిన్ననాగ స్వామి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి తెలిపారు. ఈ ఫైలింగ్ ప్రక్రియను ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆపస్ జిల్లా కార్యాలయంలో ఉచితంగా చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మంత్రి టీజీ భరత్‌కు సన్మానం

కల్లూరు, జూలై 18: పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ కమర్షియల్ టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ సంఘ నాయకులు సన్మానించారు. గురువారం మంత్రి చాంబరులో సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామలింగన్న ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు, నాగరాజు, రహీం, హైదర్‌అలీ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రం పరిశీలన: కల్లూరు మండలంలోని ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రాన్ని రాష్ట్ర ట్రైనింగ్ ప్రోగ్రాం ఆఫీసర్ కల్పన శైల పరిశీలించారు. గురువా రం గోవర్ధన్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని టీచింగ్ ఎట్ రైట్ లెవల్ కార్యక్రమం అమలు, రికార్డులు, విద్యార్థుల స్థాయిని పరిక్షించారు. ఎంఈఓ ఎం.శ్రీనివాసులు, సమగ్రశిక్షా సెక్టోరల్ ఆఫీసర్ సురేష్, అబ్దుల్ పాల్గొన్నారు.

బిల్డింగ్‌పై నుంచి కింద పడి సెంట్రింగ్ కూలీ దుర్మరణం

కర్నూలు, జూలై 18: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్టీఆర్ బిల్డింగ్స్‌లో మొదటి అంతస్థు నుంచి కింద పడి నాగభూషణం (35) అనే సెంట్రింగ్ కూలీ దుర్మరణం చెందాడు. స్థానిక బిర్లాగడ్డ కాలనీకి చెందిన ఈయన సెంట్రింగ్ పని చేస్తుంటాడు. రోజు మాదిరిగానే గురువారం కూడా భవన నిర్మాణ పనికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో మొదటి అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయనను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ మోటార్ చోరీ

సి.బెళగల్, జూలై 18: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన పింజరి గిడ్డయ్య అనే రైతు పొలంలో వ్యవసాయ మోటార్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈవిషయంపై రైతు గిడ్డయ్య గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు బుధవారం మొహర్రం పండుగ ఉండటంతో గిడ్డయ్య పొలానికి వెళ్లలేదు. గురువారం పొలానికి వెళ్లి చూడగా వ్యవసాయ మోటార్, విద్యుత్ వైర్లు, స్టార్టర్ చోరీకి గుర య్యాయి. దీంతో ఆయన పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తలుపులు వేశారు..

కర్నూలు(హాస్పిటల్), జూలై 18: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని బూత్ బంగ్లాలో ఉన్న ఎంఎస్-5, ఎంఎస్-06 యూనిట్ల మరుగుదొడ్లకు అధికారులు తలుపులు వేయించారు. గురువారం పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తక్షణమే తలుపులు బిగించాలని ఆదేశించారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న ఏపీ హంసా సిటీ నాయకులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 18: వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ హంసా వైద్య ఉద్యోగుల సంఘం కర్నూలు సిటీ నూతన కార్యవర్గం కర్నూలు సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డిని కోరింది. గురువారం నూతనంగా ఎన్నికైన ఏపీ హంసా కర్నూలు సిటీ కార్య వర్గ సభ్యులు సూపరింటెండెంట్ కలిశారు. ఈ సందర్భంగా ఏపీ హంసా సిటీ అధ్యక్షుడు టి.గోవిందు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ చక్రిధర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, వైస్ ప్రెసిడెంట్లు సంపత్, జాయింట్ సెక్రటరీ లిల్లెమ్మ, నాయకులు చిరంజీవి, ఫార్మాసిస్టు శర్మ, నర్సింగ్ అసోసియేషన్ నాయకురాలు మంజుల దేవి పాల్గొన్నారు.

జీపీఎస్‌ను రద్దు చేయాలి: డీటీఎఫ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 18: గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్)ను రద్దు చేయాలని డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, జిల్లా కార్యదర్శి ముద్దురంగప్ప, బెళగల్ మండల బాధ్యులు సోమశేఖర్, హుశేన్, కర్నూలు సిటీ బాధ్యులు గోపాల్, లక్ష్మీనారాయణ, కృష్ణగిరి బాధ్యులు సాయి బాబా, రాఘవేంద్ర, స్వామిశేఖర్, శుభాన్‌లు కోరారు. ప్రధాన కార్యదర్శి తిమ్మప్ప మాట్లాడుతూ జీవో 117, దాని అనుబంధ జీవోల వల్ల ప్రాథమిక స్కూల్‌లో పాత పద్ధతిలో కొనసాగించాలని కోరారు. ఉద్యోగులకు బకాయిపడ్డ పాత పీఆర్సీ బకాయిలను చెల్లించాలని కోరారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

కర్నూలు(న్యూసిటీ), జూలై 18: నగర పాలక సంస్థకు సంబంధించిన స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు కమిషనర్ భార్గవతేజ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మొదటి రోజు ఒక్క నామినేషన్ దాఖలైంది. నగర పాలక సంస్థ అధికారులకు 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి నామినేషన్ పత్రాలు సమర్పించారు. నేటి నుంచి 24 వరకు ప్రతి రోజు ఉద యం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయంలో నామినే షన్లను స్వీకరణ ఉంటుంది. అదే రోజు సాయంత్రం స్వీకరించిన వారి పేర్లను నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తారు. 25న పరిశీలన, 28న విత్‌డ్రా, ఆగస్టు 1న పాత కౌన్సిల్ హాలులో ఎన్నికలు జరిగిన అనంతరం అభ్యర్థులను ప్రకటిస్తారు. అయితే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా మేయర్ వ్యవహరిస్తారు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 18: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. గురువారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి తాగునీరు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌తో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ మౌర్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 18: నగరంలో నెలకొన్న సమస్యలను తర్వగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ భార్గవతేజ సం బంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాబుజగ్జీవన్‌రావు నగర్‌లో మరుగుదొడ్లు, రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే జలవనరులశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఆనంద్ థియేటర్ ఎదుట డంప్ తొలగించి గ్రీనరి, బాబుజగ్జీవన్‌రావు నగర్ కేసీ కెనాల్ వద్ద అవసరమైన చోట్ల రక్షణ వలయం ఏర్పాటుకు చేయాలన్నారు. ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వ రరెడ్డి, ఎంఈ షాకీర్, డీసీపి సంధ్యారాణి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఏసీపీ శశికళ, రంగస్వామి, టీపీఎస్ మంజులమ్మ పాల్గొన్నారు.

కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూలై 18: కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. గురువారం 41వ వార్డు పరిమళా నగర్ పార్క్, న్యూఈద్గా సమీపంలో అభివృద్ధి పనులకు ఆమె భూమి పూజ చేశారు. పరిమళానగర్ సమీపంలో సీసీ డ్రైన్ నిర్మాణం, శిల్పా అపార్ట్‌మెంట్ నుంచి డిస్పోజల్ డ్రైన్ నిర్మాణం, కౌసల్య అపార్ట్‌మెంట్ నుంచి విష్ణుటౌన్‌షిప్ వరకు నూతన సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే కొత్తఈద్గా సమీపంలోని సర్వీస్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షల సీఎండీఎఫ్ నిధులతో ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ నగరంలో కరెంట్, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ రాజశేఖర్, ఏఈ దినేష్, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు పెరుగు పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడు పెద్ద టీచుపల్లి, 41వ వార్డు ఇన్‌చార్జి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్‌గౌడ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్‌గౌడ్, టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ.మాదన్న, కురువ ధనుంజయ, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, కోట్ల తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి



నన్నూరులో ఏవోకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు, జూలై 18: కౌలు రైతులకు గుర్తింపు కార్డులతోపాటు ఉపాధి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వ్యవసాయ రైతు కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న కోరారు. గురువారం మండలంలోని నన్నూ రు సచివాలయం ఎదురుగా ఏపీ రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వ్యవ సాయాధికారి అనితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, పంటల బీమా పరిహారం, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ఉపాధి పెండింగ్ బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో రైతులు, వ్యవసాయ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వీటితోపాటు నకిలీ విత్తనాలు, పురుగు మందులతో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మల్లేష్, మాసూం బాషా, దస్తగిరి, బుజ్జన్న, శివ, రాముడు, దేవరాజు, రమేష్, షేక్షా పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 18: శాస్త్రీయ పద్ధతిలో నీటి సంరక్షణ పనులను చేపట్టాలని ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమిషనర్ చిత్తరంజన్ దాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జలశక్తి అభియాన్ (క్యాచ్ రైన్-2024)కు సంబంధించి ఇరిగేషన్, డ్వామా, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణ పనులను విరివిగా చేపట్టాలని అధికారులను సూచించారు. డ్వామా ద్వారా ప్రస్తుతం జరుగుతున్న 747 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, టెక్నికల్ ఆఫీసర్ (సైంటిస్ట్-సీ) బిజయ్ కేతన్ మొహం త, సీపీవో హిమప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా టీసీ లక్ష్మమ్మ వర్ధంతి

కర్నూలు(న్యూసిటీ), జూలై 18: మహిళా ఉద్యమ నేత టీసీ లక్ష్మమ్మ 9వ వర్ధంతిని నగరంలోని పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. గురువా రం ముజఫర్‌నగర్ టీసీ లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రం, సుందరయ్య భవన్, 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీ, సోమిశెట్టి నగర్‌లో జిల్లా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ టీసీ లక్ష్మ మ్మ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వరకట్నపు వేధింపులతోపాటు అనేక సమస్యలపై ఆమె పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి, జే.లక్ష్మీబాయి, సుధాకరప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

పచ్చ పురుగుపై ఆందోళన వద్దు: ఏవో

సి.బెళగల్, జూలై 18: పత్తి పంటకు సోకే పచ్చ పురుగుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో హనుమంతు అనే రైతు సాగు చేసిన పత్తిపంటను మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పం టకు సాధారణంగా పచ్చ పురుగు వస్తుంటాయని, వాటి నివారణకు మేపిక్యాక్లోరైడను పిచికారి చేయాలని రైతులకు సూచించారు. పంట మార్పిడి చేయడం వలన రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు అన్నారు. ఏవో వెంట ఎంపీఈవోలు సిద్దు, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(కల్చరల్), జూలై 18: విష్ణుటౌన్ షిప్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, దోమల నివారణ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. రంగబాబు, బోయ నాగన్న, నారాయణమ్మ, కర్రెమ్మ, శేషమ్మ, సుంకులమ్మ, ముంతాజ్ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

6,500 బెల్లం ఊట ధ్వంసం

కర్నూలు, జూలై 18: ఎస్పీ జి.బిందుమాధవ ఆదేశాల మేరకు సెబ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా సెబ్ పోలీసులు నాటుసారా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5వేల లీటర్ల నాటుసారా, బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తుగ్గలి మండలంలోని రోళ్లపాడు తండా గ్రామ పరిసరాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 2,700 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను, 50 లీటర్ల నాటుసారాను, అలాగే మద్దికెర మండలం బొమ్మనపల్లి లో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కల్లూరు మండలంలోని ఓబు లాపురం తండా గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 1350 లీటర్లబెల్లం ఊటను, 30 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో కర్నూలు సెబ్ ఎస్ఐ రెహానాబేగం, సిబ్బంది ఉన్నారు. ఆదోని పట్టణం, సింగరాయికొండల తదితర ప్రాంతాల్లో ఆదోని సెబ్ పోలీసులు దాడులు చేసి ఒక మహిళా విక్రేత నుంచి 68 లిక్కర్ ప్యాకెట్లను కొండగుట్టల వద్ద రెండు స్థావరాలపై దాడులు చేసి 1700 లీటర్ల బెల్లం ఊటను, 30 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఆలూరు మండలంలోని అరికెర తండా గ్రామ పరి సరాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 450 లీటర్లనాటుసారా, బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

15 లీటర్ల నాటు సారా స్వాధీనం

కోడుమూరు (రూరల్), జూలై 18: కోడుమూరు సెబ్ పోలీసుల దాడిలో 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలివి. స్టేషన్ పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో గురువారం వడ్డె మద్దిలేటి అనే వ్యక్తి వద్ద 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని అన్నారు. ఈదాడుల్లో సెబ్ ఎస్ఐ ఆలీబేగ్, సిబ్బంది శంకర్‌నాయక్, వీరుపాక్షిరెడ్డి, సువర్ణమ్మ పాల్గొన్నారు.

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

మురుగునీటిలోనే తాగునీటి కొళాయి



మురుగునీటి మధ్య ఉన్న కొళాయి

మద్దికెర, జూలై 18: రామ్‌నగర్ కాలనీలో ఉన్న మంచినీటి కొళాయి మురుగునీటి మధ్యలో ఉంది. ఈ కాలనీలో మొత్తం 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. మినీ వాటర్ ట్యాంకు వద్ద నీటిని పట్టుకునే సమయంలో కిందపడే వృథా నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడతో అక్కడే నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ వృథా నీరు బురదనీటిగా మారి దోమల వృద్ధి కేంద్రంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. అక్కడ నీటిని పట్టుకోవాలంటే ముక్కు మూసుకొని నీరు పట్టుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దళిత ప్రజాసంఘాల ఆందోళన

ఆదోని (అగ్రికల్చర్), జూలై 18: నాగనాతనహళ్లి గ్రామంలో అగ్రవర్ణాల చేతిలో హత్యకు గురైన దళిత మహిళ గుండమ్మ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని దళిత ప్రజాసంఘాల కన్వీనర్ రామతీర్థం అమరేష్ మాదిగ కోరారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామస్థులతో కలిసి నిరసన తెలిపారు. గ్రామంలో దళిత వర్గాలకు చెందిన కుటుంబాలు అభద్రతాభావంతో భయాందోళనలు చెందుతున్నారన్నారు. తక్షణమే గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. గుండమ్మ కుమారుడు కిషోర్‌కు రక్షణ కల్పించాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందేలా చూడాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. మాల మహానడు జిల్లా అధ్యక్షుడు సాయిరాం, నరసప్ప, బీఎస్పీ నాయకుడు లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు, మారెప్ప, రామలింగ, మహిళా సంఘం అధ్యక్షురాలు బతుకమ్మ, చార్లెస్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాంజల చెరువు నుంచి నీటిని సరఫరా చేస్తాం : ఎమ్మెల్యే



రాంజల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్, జూలై 18: పట్టణ ప్రజలకు ఎంతో కాలంగా తాగునీటి అవసరాలు తీర్చిన రాంజల చెరువు నుంచి తిరిగి తాగునీటి సరఫరా చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం పట్టణ పొలిమేరలోని చారిత్రాత్మక రాంజల చెరువును ఆయన మునిసిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెరువులో ఉన్న కలుషిత నీటిని బయటికి తోడివేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, చెరువులో నీటిని ఖాళీ చేసి అందులోని వ్యర్థాలను తొలగిస్తామని పేర్కొన్నారు. తుంగభద్ర లోలెవెల్ కెనాల్‌కు తాగునీటి అవసరాల కోసం వదిలిన నీరు మరో నాలుగు రోజుల్లో ఆదోని పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ ఇంజనీర్ వెంకట చలపతి సిబ్బంది బీజేపీ అసెంబ్లీకో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఉపేంద్ర కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే సమావేశం : మునిసిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో వివిధ పార్టీలకు చెందిన కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే పార్థసారథి సమావేశమయ్యారు. కాంట్రాక్టర్లు ముందుకు వస్తేనే అభివృద్ధి పనులు వేగవంతంగా జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధిని అమలు చేయడమే ధ్యేయంగా పనిచేద్దామని పేర్కొన్నారు. ఇంజనీర్ వెంకట చలపతి, డీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ బీజేపీ నాయకుడితో ఎమ్మెల్యే భేటీ : బీజేపీ మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు. సీనియర్ నాయకుడు బద్రి నారాయణప్పను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, సీనియర్ నాయకుడు దేశాయ్ చంద్రన్న తదితరులు ఉన్నారు.

ఐదేళ్లుగా అలుపెరగని పోరాటం..





పేదలకు ఇచ్చిన స్థలాలివే, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారుల (ఫైల్)

- ఇళ్ల స్థలాల కోసం లబ్ధిదారుల ఎదురు చూపులు
- న్యాయం జరుగుతుందని కొత్తప్రభుత్వంపై ఆశలు

మద్దికెర, జూలై 18: పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు.. అయితే, ఆనాటి వైసీపీ నాయకులు అడ్డుకోవడంతో లబ్ధిదారులు ఐదేళ్ల నుంచి అలుపెరగకుండా పోరాడుతూనే ఉన్నారు. ప్రభుత్వం మారి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. బాధితుల్లో ఆశలు చిగురించాయి. మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో 117/1ఏలో నాలుగు ఎకరాల్లో ఆనాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, కలెక్టర్ చేతుల మీదుగా 2016లో 39 మందికి రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారే గానీ.. స్థలాలు చూపకుండా నిర్లక్ష్యం వహించారు. 2019లో ప్రభుత్వం మారడంతో వైసీపీ నాయకులు 39 మంది లబ్ధిదారులకు రెండు సెంట్ల స్థలం ఇచ్చేందుకు ఒప్పుకోలేదు. దీంతో లబ్ధిదారులు కలెక్టర్, ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇస్తే ఒకటిన్నర సెంటు ఇస్తాం.. లేకపోతే లేదంటూ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో ఆ స్థలాలను సొంతం చేసుకొనేందుకు కొంత మంది బండలు పాతారు. అధికారులు రంగంలోకి దిగి స్థలాల్లోకి వెళితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేసి భయపెట్టారు. దీంతో నాటి నుంచి లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తూ కాలాన్ని నెట్టుకుంటూ వచ్చారు. పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు గెలుపొందడంతో లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలు వస్తాయన్న ఆశతో వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఆరేళ్లుగా స్థలాల్లోకి వెళ్లకపోవడంతో ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు మొలిశాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల స్థలాలు చూపించి పేదలకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రూ. వేల కోట్ల సహజ వనరులను దోచేశారు

- వైసీపీ ఆర్థిక అరాచకాలను శ్వేతపత్రాలతో బయటపెడుతున్న సీఎం చంద్రబాబు
- ఎమ్మిగనూరులో 10వేల మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, జూలై 18: గత వైసీపీ పాలకులు ఐదేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.వేల కోట్ల విలువ చేసే సహజ వనరులను దోచేశారని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన 10వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక షైనార్టీ కాలనీలో అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రకృతి వనరులను యథేశ్చగా దోపిడిచేసిందన్నారు. వారి దోపిడీకి సంబంధించిన వివరాలను సాక్ష్యాధారాలతో సహా సీఎం చంద్రబాబు శ్వేతప్రం విడుదల చేసి ప్రజలకు ముందుంచుతున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వందపడకల ఆసుపత్రిని తెచ్చానని, నిధుల కొరత పేరుతో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లయినా నిర్మాణాన్ని పూర్తి చేయలేక పోయిందని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటి వైద్యశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న వందపడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఇక్కడ పనిచేసే వైద్యులు డిప్యూటేషన్‌పై ఉండరాదని, ఇక్కడే విధులు నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షైత్రేయి, డాక్టర్ బాలాజీ, పార్టీ పరిశీలకులు శ్రీరాములు, నాయకులు మిఠాయి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

షైనార్టీ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన : స్థానిక షైనార్టీ కాలనీలో ఎమ్మెల్యే బీవీ పర్యటించారు. పలువురు మహిళలు కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రహమత్ బీతో పాటు మరోకరు మహిళ గతంతో తమ తండ్రికి ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని కొంతమంది కబ్జాచేసి తమదే అంటున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

బనవాసి భూముల ఆక్రమణ దారులను వదిలేది లేదు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 18: బనవాసి ఫారం పరిధిలో ఉన్న అటవీ భూములను ఆక్రమించుకున్న వారిని వదిలిపెట్టేదిలేదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హెచ్చరించారు. గురువారం బనవాసి ఫారంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. స్థానిక ఏపీగురుకుల పాఠశాల, ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రం, కృషివిజ్ఞాన కేంద్రం, సెంట్రల్ నర్సరీలను పరిశీలించారు. పాఠశాలకు మొదటి సారిగా వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థినులు సిబ్బంది ఘనం స్వాగతం పలికారు. అక్కడి సిబ్బంది తమకు వేతనాలు అందడంలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం పక్కనే ఉన్న ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక డిప్యూటి డైరెక్టర్‌తో మాట్లాడారు. కేంద్రం ఆదీనంలో ఉన్న అటవీ భూములను కొంతమంది ఆక్రమించుకున్నారని తన దృష్టికి వచ్చిందని దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని డీడీని ప్రశ్నించారు.కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలతో మాట్లాడారు. సెంట్రల్ నర్సరీని పరిశీలించి మొక్కలు నాటారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్



హెచ్‌బీఎస్ కాలనీలోని ధ్యాన మందిరం దారిలో తెరుకున్న మ్యాన్ హోల్ అదే కాలనీలో మరో మ్యాన్ హోల్, పంపణ్ణ గౌడు కాలనీ చర్చి దగ్గర

ఎమ్మిగనూరు టౌన్,జూలై 18 : ఎమ్మిగనూరు పట్టణంలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రెయిన్)కింద ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా మారాయి. దీంతో పట్టణవాసులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. పదేళ్ల క్రితం పట్టణంలో మురుగు నీటి యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) వ్యవస్థను ప్రారంభించారు. అయితే, ఆ పథకం కాస్త నేటికీ పూర్తి కాలేదు. యూజీడీ పైపు లైనుతో పాటు పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ ప్రధాన రహదారులతో పాటు పలు వీధుల్లో మ్యాన్ హోల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే మ్యాన్ హోల్స్ పై కప్పులను కూడా బిగించారు. ఏళ్లు గడుస్తున్న యూజీడీ పూర్తి కాకపోవడంతో నిర్వహణ సైతం సక్రమంగా లేక మ్యాన్ హోల్స్‌పై కప్పులు అనేక ప్రాంతాల్లో ధ్వంసం అయ్యాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ మ్యాన్ హోల్స్ నోళ్లు వెళ్లబెడుతున్నాయి. ప్రధానంగా పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని వీధుల్లో ధ్యాన మందిరం వెళ్లే దారిలో, సోగనూరు రోడ్డు, పంపణ్ణ గౌడు కాలనీ, చర్చి దగ్గర, ఈద్గా రోడ్డు మరికొన్ని ప్రధాన వీధుల్లోను ఇదే పరిస్థితి, వీవర్స్ కాలనీలో మరి కొన్ని గుంతలమయం అయ్యాయి, ఈ రోడ్లలో నిత్యం జనసంచారం ఉంటుంది. వాహనదారులు, పాదచారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. మ్యాన్ హోల్స్ పై కప్పులు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళలో అటుగా వచ్చేవారికి మ్యాన్ హోల్స్ కనిపించక పోవడంతో వాటిలో పడి కాళ్లు చేతులు విరిగిన ధాఖలాలు ఉన్నాయి.

హంతకులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 18 : నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మైనర్ బాలిక వాసంతిని అత్యాచారం చేసి కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మానవతావాదుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జేఏసీ నాయకులు గణేష్, యాపిలయ్య, షబ్బీర్, కొండయ్య, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చిన్నారికి సంఘీభావంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ చేరుకొని మానవహారం ఏర్పాటు చేశారు. హత్య చేసిన నిందుతులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు బి శ్రీనివాసనాయుడు, దేవేంద్రబాబు మాట్లాడుతూ చిన్నారి కుటుంబానికి రూ25లక్షల నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, ఒక ఇల్లు వేరే ప్రాంతంలో నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు రజాక్, మహేంద్ర, రాముడు, బతకన్న, రాజేష్, బజారి పాల్గొన్నారు.

మాదిగలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఎమ్మిగనూరు టౌన్,జూలై 18 : కోటేకల్లు గ్రామంలో మొహ్రం సందర్భంగా బుధవారం మాదిగలపై దాడిచేసిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్, కేవీపీఎస్ జిల్లా నాయకులు సుమాల ఆంథోని డిమాండ్ చేశారు. గురువారం వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అలాయి.. బలాయి ఆడే సమయంలో ఆ గ్రామ మాదిగలు పాల్గొంటుండగా వారిపై బీసీలు దాడి చేసి, వారి ఆస్తులను ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ఈ దాడిలో ఎనిమిది మందిని తీవ్రంగా గాయపర్చారని, వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ మాదిగలపై పెత్తందారి కులాల ఆధిపత్యం చలాయిస్తుండడం దారుణం అన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, మాదిగలకు రక్షణ కల్పించాలని కోరారు.

బోధనంద సరస్వతీ తీర్థులకు ఘన సన్మానం

మంత్రాలయం, జూలై 18 : కర్ణాటక లోని ముత్తూర్ మఠం పీఠాధిపతి బోధనంద సరస్వతీ తీర్థులు, ఎంపీ సీఎన్ మంజునాథ్ దంపతులకు మఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. రాఘవేంద్ర స్వామి బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం వారికి మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శాలువ, వెండి తట్ట, నగదు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కారించారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు : రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు స్వర్ణ రథం పై విహరించారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం ద్వాదశి వేడుకలను పురస్కరించుకొని అర్చకులు తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయులను అధిష్ఠించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు హర్షణీయం

పెద్దకడుబూరు, జూలై 18: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు హర్షణీయమని టీడీపీ తెలుగు రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రైతుల భూములను కాజేసే దురుద్దేశ్యంతో జగన్ ప్రభుత్వం తెచ్చిన ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

బీవీని కలిసిన టీడీపీ నాయకులు : ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని పెద్దకడుబూరు టీడీపీ నాయకులు బసలదొడ్డి ఈరన్న, ఏసేపు, హనుమంతురెడ్డి, విజయ్‌కుమార్, హనుమన్న మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రాలయం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై వారితో చర్చించినట్లు వారు తెలిపారు.

భూదందాలే లక్ష్యంగా వైసీపీ పాలన : ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ,జులై18: రాష్ట్రంలో భూదందాలు, సహజవనరుల దోపిడి లక్ష్యాలుగా గత వైసీపీ ప్రభుత్వపాలనసాగిందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్లపాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలను తెలిపేందుకు శ్వేతపత్రాలను విడుదలచేస్తున్నామన్నారు.ఐదేళ్లపాలనలో సుమారు1.75లక్షల ఎకరాల భూఆక్రమణలు జరిగాయన్నారు. వాటివిలువ 35,576 కోట్లుఉంటుందన్నారు. ఇళ్లపట్టాలపేరిట 10వేల ఎకరాలు, ఇసుకదందాలో రూ9,750కోట్లు అడ్డంగా దోచుకుతిన్నారని, ప్రజల భూములను కొట్టేయడానికి భయంకరమైన ల్యాండ్‌టైటిలింగ్‌యాక్ట్‌ను వైసీపీ ప్రభుత్వ అమలులోకి తెచ్చిందని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆచట్టాన్ని రద్దుచేసిందన్నారు. గుజరాత్‌లో అమలులో ఉన్న ల్యాండ్‌గ్రాబింగ్ చట్టం రాష్ట్రంలో అమలుచేస్తామని, ఈ చట్టంద్వారా కబ్జాదారులు తమకు ఆభూమిపై ఉన్నహక్కులను నిరూపించుకోవాల్సిఉంటుందన్నారు. సహజవనరులు, భూగర్భఖనిజనిక్షేపాలను అడ్డంగా దోచేశారన్నారు.

టీడీపీతోనే యువతకు పెద్దపీట

తుగ్గలి, జూలై 18: తెలుగుదేశం పార్టీతోనే యువతకు పెద్దపీట వేస్తుందని టీడీపీ యువ నాయకులు నల్లగుండ్ల రవి, మునీశ్వర్‌గౌడు, మహేష్‌గౌడు అన్నారు. గురువారం మండల పరిధిలోని నల్లగుండ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగంతో అల్లాడిపోయామనీ, గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగ యువతకు భృతితో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించారని అన్నారు. రాబోవు రోజుల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు.

తగ్గుముఖం పట్టిన అతిసార

- సుంకేశ్వరిలో కొనసాగుతున్న ఉచిత వైద్యశిబిరం



2 బోరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, జూలై 18: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో విజృంభించిన అతిసార గురువారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. మూడు రోజులుగా అతిసారా రోగుల సంఖ్య ముగ్గురి చేరింది. గురువారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గ్రామంలో పర్యటించి అతిసార వ్యాప్తికి గల కారణాలను అడిగి తెలుసుకుని మృతి చెందిన బాలిక కుటుంబానికి రూ.5వేలు తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం బోరు పాయింటును పరిశీలించారు. అధికారులతో సమీక్ష అనంతరం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ వేదస్వరూప, ఈవోఆర్‌డీ ప్రభావతి దేవి దగ్గరుండి దాదాపు 13 ట్యాంకర్లతో గ్రామానికి రక్షిత మంచినీటి సరఫరా అందిస్తున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలమురళికృష్ణ, సత్యవతి, డాక్టర్ సురేష్, వసంతమ్మ, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీవో మునెప్ప గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి అస్వస్థతకు గురైన వారిని గుర్తించి సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి రావాలని సూచించారు.

ఆర్వో ప్లాంటు మంజూరు చేస్తాం : ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సుంకేశ్వరిలో ప్రబలిన అతిసార దాదాపు అదుపులోకి వచ్చిందని, భవిష్యత్తులో రాకుండా ఉండేందుకు ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందింస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఈమేరకు ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్ స్పందించి అధికారులను అప్రమత్తం చేయడంతో కేసులు తగ్గుముఖం పట్టాయని అన్నారు. సమావేశంలో గురెడ్డి భీమిరెడ్డి, సర్పంచ్ ముకురన్న, రఘునాథరెడ్డి, రోగెప్ప, శ్రీనివాసులు, అంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష కాంట్రాక్ట్ వర్కర్స్‌కు గౌరవవేతనం ఇవ్వాలి

గోనెగండ్ల, జూలై 18: విద్యాశాఖ సమగ్రశిక్షలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం గౌరవవేతనం వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు పుల్లన్న, కళ్యాణి, శ్రీనివాసులు, నాగముని కోరారు. గురువారం వారు మాట్లాడుతూ సమగ్రశిక్షణలో సీఆర్‌పీ, పీఆర్‌టీ, ఐఈఆర్‌టీ, కేజీబీవీ, టీచింగ్, నాన్‌టీచింగ్, మెసింజర్, ఎంఐఎస్, డీటీపీ లుగా జిల్లాలో 773 మంది పనిచేస్తున్నారని, అధికారులు స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. రామాంజినేయులు, జ్యోతి, రవికుమార్, గోవిందరాజులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరిగిపోతున్న అత్యాచారాలు : ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, జూలై 18: రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని వాటిని నియంత్రించడంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విఫలమయ్యారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. ఆలూరు ఆర్‌అండ్ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు మండలం చిన్నారిపై అత్యాచారం, హత్య జరిగినా ఇంతవరకు బాధితులను మంత్రి అనిత ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. పది రోజులు గడిచిన ఇంతవరకు బాలిక మృతదేహాన్ని కనుగొనలేకపోయారని అన్నారు. వైసీపీ నాయకులు అరికేర వెంకటేశ్వర్లు, వీరేష్, భాస్కర్, మాదన్న, హరి, మరకట్టు ఎల్లప్ప పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

ఆలూరు, జూలై 18: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు. ఉరువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక, మద్యం మాఫియాలను సాగిస్తూ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు కోట్లాది రూపాయలను దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిందని, పింఛన్లను పెంపుదల చేసిందని గుర్తుచేశారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంగా కల్పించేందుకు ఏర్పాటు చేస్తుందన్నారు. సమాజంలో టీడీపీ సీనియర్ నాయకులు రామనాథ్ యాదవ్, జిల్లా నాయకులు సురేంద్ర, కొమ్ము రామాంజినేయులు, సాలి సాహెబ్, మండల నాయకులు బసవరాజు, ముద్దు, రంగయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పార్టీ బలోపేతానికి నిరంతర కృషి

గోనెగండ్ల/ ఆలూరు, జూలై 18: జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని ఎమ్మిగనూరు, ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జులు రేఖాగౌడ్, వెంకప్ప కోరారు. గురువారం గోనెగండ్ల, ఆలూరులో వేర్వేరుగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నాయకులే పార్టీకి బలమైన క్యాడర్ అని గుర్తు చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారికి పార్టీ తప్పక సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. ఈ నెల 28వ తేది వరకు కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి జనసేనలో చేర్పించాలాని కోరారు. గోనెగండ్ల నాయకులు మాలిక్, ఖాసీంసాహెబ్, సుభాన్, మధు, మల్లికార్జున, ఆలూరులో జనసేన ఐటీ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, మండల నాయకులు చత్రపతి, అరవింద్, చంద్ర, వీరేష్, అశోక్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఉచ్చిరప్ప, జగదీష్ పాల్గొన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీకి అన్యాయం

మంత్రాలయం, జూలై 18: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, గూండా రాజకీయాలు చేశారని, వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తామని మంత్రాలయం టీడీపీ నాయకులు ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు జీవో512ను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలు పరచలేదని తెలిపారు. జిల్లాలో వైసీపీ కార్యాలయం కోసం రెండెకరాలు నామమాత్రపు రుసుముతో 30 ఏళ్లకు లీజుకు ఇచ్చుకున్న వైసీపీ నాయకుల బాగోతం బయట పెడుతామని తెలిపారు. ఇటువంటి అక్రమాలను ప్రజలకు వివరించి టీడీపీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగే విదంగా ప్రతి టీడీపీ కార్యకర్త కృషి చేయాలని తెలిపారు.

మల్కాపురం వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 18: మల్కాపురం గ్రామ వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ శేషారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వీఆర్వో తేజ గ్రామంలోని సచివాలయంలో ఉండకపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ఎమ్మిగనూరు టౌన్,జూలై 18 : ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురురాజ్ అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులోవారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి-ప్రాణాలను పరిరక్షించుకోండి , బైకులు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించి ప్రాణాలను కాపాడుకోవాలి అన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి గాంధీ సర్కిల్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దామొదర్‌రెడ్డి, రంగనాథ్, సాల్మోన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారికి భూమి పూజ

మద్దికెర, జూలై 18: దశాబ్ద కాలం తర్వాత మద్దికెర గ్రామంలోని మద్దమ్మ బాయి వంక వీధిలో సీసీ రహదారికి ఎట్టకేలకు భూమి పూజ చేశారు. ఆ ప్రాంత ప్రజలు ఎన్నికల సమయంలో అధికారులకు పలుమార్లు విన్నవించారు. దీంతో గురువారం పంచాయతీరాజ్ ఏఈ విష్ణు, సచివాలయ ఏఈ చంద్ర, ఎంపీపీ డి.అనితా యాదవ్, జడ్పీటీసీ సభ్యులు డి.మురళిధర్ రెడ్డి సీసీ రోడ్డుకు భూమి పూజను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలని కోరారు.

గోనెగండ్లలో బాలుర హస్టల్ ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల, జూలై 18: మండల కేంద్రమైన గోనెగండ్లలో ఎస్సీఎస్టీ బీసీ బాలుర హస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిఉదయ్ డిమాండ్ చేశారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలో 28 గ్రామాలు ఉన్నాయని, అయితే బీసీ హస్టల్ లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మధ్యలోనే చదువులు మానివేసి వలస కూలీలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో కరువు కాటకాలు ఎక్కువగా ఉంటాయని అయితే విద్యార్థులకు సరైన హస్టల్స్ లేక పోవడం కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు వలసలు వెళ్లే సమయంలో తమ పిల్లలను ఎక్కడ పెట్టాలో తెలియక తమ వెంట కూలీ పనులకు తీసుకువెలుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షకార్యదర్శులు పవన్, రంగస్వామి, నాయకులు వేణు, శివ పాల్గొన్నారు.